నిరంతర నిఘా..



ముదిగొండలో కవాతు నిర్వహిస్తున్న సీఆర్‌పీఎఫ్ బలగాలు

- సమస్యాత్మక గ్రామాల్లో సీఆర్‌పీఎఫ్ ఫ్లాగ్ మార్చ్
- గ్రామాల్లో పెట్రోలింగ్
- ఎన్నికలపై అధికారుల అవగాహన

ముదిగొండ: ముదిగొండలోని 25గ్రామ పంచాయతీలున్నాయి. వాటిల్లో 33గ్రామాల్లో 55పోలింగ్ బూత్‌లు ఉండగా.. మొత్తం 4,81,560 ఓటర్లున్నారు. అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు అధికారులు, గత నెల రోజుల నుంచి కసరత్తు చేస్తున్నారు. మండలంలోని సమస్యాత్మక గ్రామాలుగా వల్లబి, పెద్దమండవ, కమలాపురం, గంధసిరి, వనంవారికిష్టాపురం, చిరుమర్రి, సువర్ణాపురం, ముదిగొండ, కట్టకూరు, యడవల్లి, గోకినేపల్లి గ్రామాలను పోలీసులు గుర్తించారు. ఈ గ్రామాల్లోని 700మంది వివిధ రాజకీయ నాయకులను, మద్యం బెల్టుషాపులు నిర్వహిస్తున్న 250మందిని, 17మంది రౌడీషీటర్లపై బైండోవర్ కేసులు నమోదు చేశారు. ఆయా గ్రామాల్లో సీఆర్‌పీఎఫ్ బలగాలు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించి అవగాహన కల్పించారు.

పోలింగ్ బూత్‌ల్లో నిరంతర నిఘా..

ప్రతీ పోలింగ్‌బూత్‌లో సీసీ కెమెరాలను అమర్చి ఎప్పటికప్పుడు నిఘా ఏర్పాటు చేయనున్నారు. పోలింగ్ నిర్వహణకు, ప్రశాంతంగా ఓటర్లు ఓటు వినియోగించేందుకు ఇతర రాష్ట్రాల నుంచి 100మంది సీఆర్‌పీఎఫ్ బలగాలను రప్పించనున్నారు. సెక్టోరియల్ ఆఫీసర్లు, రూట్ ఎలక్షన్ ఆఫీసర్లు ప్రతి పోలింగ్ కేంద్రంలో మంచినీటి సౌకర్యం, విద్యుత్, ఫ్యాన్లు, కుర్చీలు, వృద్ధులకు, వికలాంగులకు ర్యాంపులు ఏర్పాటు పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి.

ఓటుకు సహకరించని 121 మంది వికలాంగులు, వృద్ధులు..

ముదిగొండ మండలంలోని 55పోలింగ్ బూత్‌ల్లో ఓటు వేసేందుకు సహకరించని 121మంది వృద్ధులు, వికలాంగులను గుర్తించారు. వారికోసం అధికారులు ప్రత్యేక వాహనం ఏర్పాటు చేయనున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎప్పటికప్పుడు పోలీసులు, ఆబ్కారీ, విజిలెన్స్, రెవెన్యూ, ఎన్నికల అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

చెక్‌పోస్టుల వద్ద పోలీసుల తనిఖీలు..

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్యన వల్లబి వద్ద చెక్ పోస్టును ఏర్పాటు చేశారు. మద్యం 56లీటర్లు, నగదు రూ.12.74లక్షలు, వెండి, బంగారం రూ.6.17లక్షలు, ఇత్తడి సామన్లు రూ. 1.77వేలు పోలీసులు పట్టుకున్నారు. ఎన్నికలపై అవగాహనకై వాల్‌రైటింగ్‌లు ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద రాయించారు. ప్రతి పోలింగ్ స్టేషన్‌ను పంచాయతీ సిబ్బందితో పారిశుధ్యం నిర్వహించారు. ఈ పర్యవేక్షణలో తహసీల్దార్, ఎంపీడీఓ, ఎంపీఓలు ఓటర్ల స్లిప్పుల పంపిణీని పర్యవేక్షించి, అవగాహన కల్పిస్తున్నారు.



పోలింగ్ బూత్‌లో సౌకర్యాలను పర్యవేక్షిస్తున్న అధికారులు



వాల్‌రైటింగ్‌తో ఓటర్లకు అవగాహన

ఓటు వినియోగించుకోవాలి..



ప్రతీ ఒక్కరు ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకునేలా అవగాహన కల్పిస్తున్నాం. ప్రతి పోలింగ్ బూత్‌ల్లో ఓటర్లకు ఇబ్బంది కలగకుండా సౌకర్యాలు సమకూర్చాం. ప్రతీ గ్రామంలో బీఎల్ఓల ద్వారా కరపత్రాలతో పాటు ఓటర్ల స్లిప్పులు పంపిణీ చేస్తున్నాం. సీ విజిల్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ప్రలోభాలపై నిర్భయంగా ఫిర్యాదు చేయవచ్చు.

– తహసీల్దార్ రామారావు, ముదిగొండ

ప్రజలు సహకరించాలి..



ముదిగొండ మండలంలోని 55పోలింగ్ బూత్‌ల వారిగా ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు ప్రజలు సహకరించాలి. ఎలాంటి ఇబ్బంది జరిగిన, అత్యవసర సమయంలో 100కు డయల్ చేయాలి. అందరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి. సమస్యాత్మక కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తాం. ఎన్నికల నిభందనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరంగా చర్యలు తప్పవు.

– ఎస్సై నరేష్, ముదిగొండ

కాంగ్రెస్ మాయమాటలు నమ్మొద్దు



మాట్లాడుతున్న సంభాని చంద్రశేఖర్, పక్కన సండ్ర వెంకటవీరయ్య, నాయకులు



కల్లూరురూరల్: లోకవరంలో ప్రచారం చేస్తున్న కొండూరి సుధాకర్

సత్తుపల్లి: కాంగ్రెస్ మాయమాటలు నమ్మొదని మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్ అన్నారు. సత్తుపల్లి పట్టణంలోని బీఆర్‌ఎస్ అభ్యర్థి సండ్ర వెంకటవీరయ్యతో కలిసి ఆదివారం విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంభాని మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో సండ్ర వెంకటవీరయ్యకు మద్ధతుగా కాంగ్రెస్ పార్టీ ఆదేశం మేరకు పనిచేశా.. ఈ సారి దేవుడే ఆయనకు మద్ధతుగా పంపించినట్లుగా ఉందన్నారు. ఇక్కడే ఉంటూ తన నియోజకవర్గ సమస్యల పరిష్కారంలో ముందుండి పరిష్కరించిన సండ్రను అత్యధిక మెజారిటీతో గెలిపించుకోవాలని అన్నారు. కారు గుర్తుకి ఓటేసి కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య మాట్లాడుతూ.. కేసీఆర్ సారథ్యంలో తెలంగాణ దేశంలోనే ప్రథమ స్థానంలో ఉందన్నారు. ప్రతిఒక్కరూ కారు గుర్తుపై ఓటేసి తనను గెలిపించాన్నారు. అధికారం చలాయించే ప్రతిపక్షాలు కావాలో.. సేవకుడిలా పనిచేసే నేను కావాలో మీరే తేల్చుకోవాలన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, కొత్తూరు ఉమామహేశ్వరరావు, ఎస్‌కే రఫీ, కొండపల్లి రమేష్‌రెడ్డి, సాల్మన్‌రాజు, గోళ్ల అప్పారావు, టీబీజీకేఎస్ నాయకులు ఎండి రజాక్ , ఉపేంద్రాచారి, చెన్నకేశవరావు పాల్గొన్నారు.

సండ్ర గెలుపును కాంక్షిస్తూ..

కల్లూరురూరల్: సత్తుపల్లి అభ్యర్థి సండ్ర వెంకటవీరయ్య విజయాన్ని కాంక్షిస్తూ నాయకులు కొండూరి సుధాకర్ ఆదివారం మండలంలోని తూర్పు లోకవరం, కప్పలబంధం, బత్తులపల్లి గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. బత్తులపల్లిలో 29 కుటుంబాలు బీఆర్‌ఎస్‌లో చేరాయి. సర్పంచ్‌లు శీలం సత్యనారాయణరెడ్డి, నందిగామ ప్రసాద్, తడికమళ్ల సామ్యేలు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలు అమలు చేస్తాం



బోనకల్: భట్టికి హారతి ఇచ్చి స్వాగతం పలుకుతున్న మహిళలు



మధిర: ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తున్న మల్లు సూర్యవిక్రమాదిత్య

బోనకల్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీ పథకాలు అమలు చేసి తీరుతామని సీఎల్పీ నేత, మధిర కాంగ్రెస్ అభ్యర్థి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. మండలంలోని సీతానగరం, పెద్దబీరువల్లి, జానకీపురం, చిన్నబీరువల్లి, నారాయణపురం, రామాపురం, గార్లపాడు, రావినూతల గ్రామాల్లో ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించగా.. మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా భట్టికి సీపీఐ, టీడీపీ వైఎస్సార్ టీపీ శ్రేణులు పాల్గొని మద్దతు తెలిపారు. ఈ ప్రచారంలో ఏపీ పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్‌వలీ పాల్గొన్నారు. ప్రచారంలో భట్టి మాట్లాడుతూ.. దొరల తెలంగాణ పోయి.. ప్రజల తెలంగాణ రావాలన్నారు. ప్రజలు కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి తనను గెలిపించాలని, కాంగ్రెస్ ప్రభుత్వ ఏర్పాటులో కీలక భూమిక పోషించిన మధిర నియోజకవర్గాన్ని అగ్రగామిగా నిలుపుతానన్నారు. ఈ నెల 30తో కేసీఆర్ పాలన కూలిపోతుందన్నారు. పలు గ్రామాల్లో బీఆర్‌ఎస్ నుంచి భట్టి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు గాలి దుర్గారావు, పైడిపల్లి కిషోర్, బందం నాగేశ్వరరావు, కర్నాటి కోటి, కోట రాంబాబు, సీపీఐ నాయకులు యంగల ఆనందరావు, తూము రోషన్‌కుమార్, టీడీపీ నాయకులు రావుట్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

భట్టి గెలుపును కాంక్షిస్తూ..

మధిర/ఎర్రుపాలెం/చింతకాని: భట్టి గెలుపు కోరుతూ ఆయన సతీమణి మల్లు నందిని, కుమారుడు సూర్య విక్రమాదిత్య పలు గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నందిని పలు చర్చిల్లో ప్రార్థనలు చేశారు. ప్రచారంలో ఇంటింటికీ తిరుగుతూ.. ఓట్లు అభ్యర్థించారు. అదే విధంగా చింతకాని మండలంలోని వందనం గ్రామంలో సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి.. పార్టీ కార్యకర్తలో సమావేశం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ భట్టి గెలుపునకు కృషి చేయాలని కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ అయిలూరి వెంకటేశ్వరరెడ్డి, పీసీసీ మెంబర్ ప్రతాపరెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, సీపీఐ మండల కార్యదర్శి మల్లికార్జున్‌రావు, సహాయ కార్యదర్శి గోపాలరావు, నాయకులు లక్ష్మణరావు, నర్సింహారావు, పిచ్చిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, వెంకన్న, రాజేష్, సతీష్, శ్రీను, శంకర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

సొంత గూటికి చేరిన సర్పంచ్

వైరారూరల్: మండలంలోని కొండకొడిమ గ్రామ సర్పంచ్ దొంతెబోయిన శ్రీనివాసరావు తిరిగి సొంత గూటికి చేరారు. గత వారం రోజుల క్రితం కాంగ్రెస్ పార్టీ ప్రచార కమిటీ కోచైర్మన్ పొంగులేటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరిన సర్పంచ్ శ్రీనివాసరావు ఆదివారం తిరిగి బీఆర్‌ఎస్ అభ్యర్థి బానోత్ మదన్‌లాల్ క్యాంపు కార్యాలయంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. మదన్‌లాల్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సర్పంచ్‌తో పాటు పలు కుటుంబాలు బీఆర్‌ఎస్ చేరాయి. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

కాకతీయ షుగర్ ఫ్యాక్టరీలో క్రషింగ్ ప్రారంభం

కల్లూరు: కల్లూరు కాకతీయ షుగర్ ఫ్యాక్టరీలో 2023–24 సీజన్‌కు సంబంధించి చెరుకు క్రషింగ్‌ను సోమవారం ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ చల్లగుల్ల నాగేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఈ ఏడాది చెరకు 1.30 లక్షల టన్నుల చెరకు క్రషింగ్ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఫ్యాక్టరీ పరిధిలోని పాత జోన్‌లైన అశ్వారావుపేట, వైరా(కుడి), మధిర, ఎర్రుపాలెం మండలాలు ఈ ఏడాది నుంచి ఈ ఫ్యాక్టరీ పరిధిలోకి వస్తాయన్నారు. ఈ సంవత్సరం చెరకు ధర టన్ను రూ.3,200 లు ప్రకటించారు. ఈ సీజన్‌లో చెరకు నాటు రైతులకు 4.5 అడుగుల దూరం నాటిన రైతులకు ఒక ఎకరానికి రెండు టన్నుల విత్తనాలు ఉచితంగా ఇవ్వనున్నట్లు తెలిపారు. దూర ప్రాంతాల నుంచి చెకు రవాణా చేయు జోన్ రైతులకు 55 కిమీ దూరం దాటిన తర్వాత ప్రతి టన్నుకు ప్రతీ కి.మీకు ఉచిత రవాణా సదుపాయం ఉంటుందన్నారు. చెరకు సాగు చేయు రైతులు ప్రోత్సాహాలను గమనించి చెరకు అభివృద్ధికి, ఫ్యాక్టరీ అభివృద్ధికి సహకరించాల్సిందిగా వైస్ ప్రెసిడెంట్ నాగేశ్వరరావు కోరారు. కార్యక్రమంలో ఫ్యాక్టరీ సివిల్ ఇంజనీర్ కొడాలి రఘునాథబాబు, కేన్ మేనేజర్ మల్లికార్జున్, ఫ్యాక్టరీ సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.



చెరకు క్రషింగ్‌ను ప్రారంభిస్తున్న నాగేశ్వరరావు

అసెంబ్లీ ఎన్నికల ప్రచారాలు

ప్రశ్నించే గొంతుకను అసెంబ్లీకి పంపాలి

వైరా/కొణిజర్ల: ప్రజా సమస్యలపై ప్రశ్నించే వైరా నియోజకవర్గ సీపీఎం అభ్యర్థి భూక్యా వీరభద్రాన్ని గెలిపించాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బొంతు రాంబాబు, ప్రముఖ వైద్యుడు డాక్టర్ చీకటి భారవి, ఐద్వా నాయకురాలు భూక్యా విజయ తెలిపారు. ఆదివారం వైరాలోని సీపీఎం కార్యాలయంలో ప్రతి నెలా 3వ ఆదివారం నిర్వహించే ఉచిత వైద్య శిబిరాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్య శిబిరాన్ని సీపీఎం అభ్యర్థి భూక్యా వీరభద్రం సందర్శించి ఓట్లు అభ్యర్థించారు. అదే విధంగా కొణిజర్లలో ఆయన సతీమని విజయ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జట్ల రంగారావు, డాక్టర్ పిల్లలమర్రి సుబ్బారావు, నాయకులు సుంకర సుధాకర్, బొంతు సమత, గుడిమెట్ల రజిత, మోహనరావు, రామకృష్ణ, రజిని, ప్రసాద్, నారాయణరెడ్డి, చలపతిరావు అనుమోలు రామారావు, కొలిపాక పద్మ, శ్రీలత, అశోక్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై పోరాడుతా..

మధిర: ఎన్నికల్లో తనను గెలిపిస్తే ప్రజా సమస్యలపై పోరాడుతానని మధిర నియోజకవర్గ సీపీఎం అభ్యర్థి పాలడుగు భాస్కర్ అన్నారు. మధిర మండలంలోని రాయపట్నం గ్రామంలో ఆదివారం ఆయన ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకుడు నర్సింహారావు, మండల కార్యదర్శి సైదులు, నాయకులు ప్రభాకర్, మధు తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ హ్యాట్రిక్ ఖాయం

ఏన్కూరు: తెలంగాణ సీఎం కేసీఆర్ అసెంబ్లీ ఎన్నికల్లో హ్యాట్రిక్ సాధిస్తాడని ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని కేసుపల్లిలో ఆదివారం వైరా బీఆర్‌ఎస్ అభ్యర్థి మదన్‌లాల్‌తో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు రైతుబంధు, రైతుబీమా, కల్యాణలక్ష్మి, పింఛన్లు తదితర పథకాలు ఏ రాష్ట్రంలో లేవన్నారు.

కారు గుర్తుకు ఓటేయండి..

ఎర్రుపాలెం: ప్రతి ఒక్కరూ కారు గుర్తుపై ఓటేసి తనను గెలిపించాలని మధిర నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి, జెడ్పీ చైర్మన్ కమల్‌రాజ్ అన్నారు. ఆదివారం మండలంలోని పలు గ్రామాల్లో విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావుతో కలిసి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల కమిటీ అధ్యక్షుడు పంబి సాంబశివరావు, మధిర ఏఎంసీ మాజీ చైర్మన్ చావా రామకృష్ణ, ఎంపీపీ శిరీష, జెడ్పీటీసీ కవిత, సొసైటీ చైర్మన్ శ్రీనివాసరావు, మాజీ జెడ్పీటీసీ కవిత, మాజీ జెడ్పీటీసీ శ్రీనివాసరావు, నాయకులు పాల్గొన్నారు.

గెలిపిస్తే అభివృద్ధి చేసి చూపిస్తాం..

తల్లాడ: సత్తుపల్లిలో బీజేపీని గెలిపిస్తే అన్ని వర్గాల అభివృద్ధికి కృషి చేస్తామని సత్తుపల్లి నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ భాస్కర్ల వీరంరాజు అన్నారు. తల్లాడ మండలం మల్సూర్‌తండా, నూతనకల్ గ్రామాల్లో ఆదివారం మండల నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కమలం గుర్తుకు ఓటేసి బీజేపీ అభ్యర్థి రామలింగేశ్వరరావుని గెలిపించాన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు వెంకటరామారావు, కృష్ణ, రాంబాబు, దినేష్, కృష్ణారావు, రమేష్, సుధాకర్ పాల్గొన్నారు.

బీజేపీ నాయకులు ప్రచారం..

పెనుబల్లి: భారతీయ జనతా పార్టీ పెనుబల్లి మండలశాఖ ఆధ్వర్యంలో ఆదివారం మండల పరిధిలోని తుమ్మలపల్లి, కొత్తకుప్పెనకుంట్ల గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. జనసేన బలపరిచిన సత్తుపల్లి నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి నంబూరి రామలింగేశ్వరరావును గెలిపించాలని గడప గడపకు ప్రచారం చేస్తూ ఎన్నికల మేనిఫెస్టోను, భారత ప్రధాని నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షులు బొర్రా నరసింహారావు, జిల్లా అధికార ప్రతినిధి పడిగల మదుసూదన్‌రావు, ప్రధాన కార్యదర్శి ఓరుగంటి రాము, ఎస్టీ మోర్చా అధ్యక్షులు బానోతు రమేష్, ఎస్సీ మోర్చా అధ్యక్షులు పేర్ల మహేష్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను గెలిపించండి

తల్లాడ: రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని, కావున సత్తుపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి మట్టా రగమయిని ఆదరించి గెలిపించాలని ఆ పార్టీ నాయకుడు మట్టా దయానంద్ అన్నారు. ఆదివారం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి కాంగ్రెస్ మేనిఫెస్టోను వివరించి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా పలువురు కాంగ్రెస్ సీనియర్ నాయకులను, కార్యకర్తలను కలుసుకున్నారు. కార్యక్రమంలో వెంకటేశ్వరరావు, జనార్దన్‌రెడ్డి, లక్ష్మీరెడ్డి, శ్రీనివాసరెడ్డి, రమేష్, మల్లిఖార్జున్, శ్రీనివాసరావు, రఘుపతిరెడ్డి, రవి పాల్గొన్నారు.

ఆశీర్వదించండి అభివృద్ధి చేస్తా..

కారేపల్లి: వైరా ఎమ్మెల్యేగా ఆశీర్వదించి గెలిపిస్తే.. అభివృద్ధి చేసి చూపిస్తానని వైరా కాంగ్రెస్ అభ్యర్థి మాలోత్ రాందాస్‌నాయక్ అన్నారు. ఆదివారం పలు గ్రామాల్లో ప్రచారం నిర్వహించగా.. పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. ఆయన వెంట టీపీసీసీ మహిళా ఉపాధ్యక్షురాలు పగడాల మంజుల, మండల అధ్యక్షుడు చంద్రప్రకాశ్, నర్సయ్య, వీరభద్రం, తిరుపతిరావు, నాగేశ్వరరావు, సక్రాం, శ్రీనివాసరావు, తాజుద్దీన్ పాల్గొన్నారు.

బీసీలను దగా చేసిన బీఆర్‌ఎస్..

కల్లూరురూరల్: బీసీలకు బిఆర్‌ఎస్ పార్టీ అన్యాయం చేసిందని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నారాయణవరపు శ్రీనివాస్ అన్నారు. ఆదివారం కల్లూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శ్రీనివాస్ మాట్లాడుతూ.. సత్తుపల్లి నియోజకవర్గంలో సండ్ర బీసీలను, దళితులను దగా చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే బీసీ కులగణన చేపడతామని చెప్పారని, దీని వల్ల తాము కాంగ్రెకు మద్దతు ప్రకటించామన్నారు. ఈ సమావేశంలో జిల్లా కన్వీనర్ పుల్లారావు, పీసీసీ కార్యదర్శి సోమేశ్వర శర్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపంథా అభ్యర్థి తరపున..

పెనుబల్లి: సత్తుపల్లి నియోజకవర్గ ప్రజాపంథా అభ్యర్థి బీరెల్లి లాజర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ జిల్లా నాయకుడు ఎం.వెంకటరెడ్డి ప్రజలను కోరారు. ఆదివారం మండలంలోని చౌడవరంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీనివాసరావు, పాదియా, దేవ, సురేష్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కుంభకోణంలో కాంగ్రెస్ నాయకుల పూజలు

ముదిగొండ: మధిర కాంగ్రెస్ అభ్యర్థి మల్లు భట్టి విక్రమార్క విజయాన్ని కాంక్షిస్తూ ఆయన అభిమానులు, కార్యకర్తలు తమిళనాడు రాష్ట్రంలోని ఆలయాల్లో పూజలు చేశారు. ముదిగొండ సహకార సొసైటీ డైరెక్టర్ వనం ప్రదీప్తబాబు, ఎన్ఆర్ఐలు ఊటుకూరి శ్రీహరి, కొండపల్లి కవిత తదితరులు తమిళనాడు రాష్ట్రంలోని కుంభకోణం ఆలయంలో పూజలు చేసినట్లు తెలిపారు.



కుంభకోణం ఆలయంలో పూజలు చేస్తున్న నాయకులు

దాచాపురంలో రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న యువకుడు

వైరారూరల్: మండలంలోని దాచాపురం గ్రామంలో మార్పు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం తలసేమియా బాధిత చిన్నారుల సహాయం కోసం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ రక్తదాన శిబిరంలో 20 మంది యువకులు స్వచ్ఛందగా రక్తందానం చేశారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షురాలు గుడిమెట్ల రజిత మాట్లాడారు. ఎన్నికల సమయంలో రక్తం లభించక తలసేమియా చిన్నారులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్న నేపథ్యాన ప్రతీ ఒక్కరు తమ బాధ్యతగా భావించి తలసేమియా వ్యాధి గ్రస్తులకు రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వేమిరెడ్డి బాలకోటారెడ్డి, వేల్పుల జయరాజు, మడుపల్లి వెంకట్, మడుపల్లి వేణు, మాగంటి సునీల్, శీలం చిన్నూరెడ్డి, గరిడేపల్లి సతీష్, తిరుమలరావు, అనూష, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ఓటర్లకు అవగాహన కల్పించండి

ముదిగొండ: ఓటర్లకు ఓటు వినియోగంపై అవగాహన కల్పించాలని తహసీల్దార్ రామారావు అన్నారు. మండలంలోని కమలాపురం, బాణాపురం, గంధసిరి, పెద్దమండవ, మల్లారం, వల్లభి గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఆదివారం ఎంపీడీఓ అశోక్, ఎంపీఓ సూర్యనారాయణలతో కలిసి పరిశీలించారు. ఓటరు స్లిప్‌లు పంపిణీ చేసేముందు ఓటర్లకు అవగాహన కల్పించాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లోని వసతులు, గోడ రాతలు, ఓటరు స్లిప్పుల పంపిణీనిని పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, బీఎల్ఓలు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



ఓటరు స్లిప్పులు పరిశీలిస్తున్న అధికారులు

నిరుపేద కుటుంబాలకు ఆర్థిక సాయం



ఉషారాణి కుటుంబానికి నిత్యావసర వస్తువులు అందజేస్తున్న సూర్యోదయ సేవా సంఘం సభ్యులు

కొణిజర్ల: మండలంలోని గుబ్బగుర్తి గ్రామానికి చెందిన సూర్యోదయ సామాజిక సేవా సంఘం వారు ఆదివారం గ్రామానికి చెందిన రెండు కుటుంబాలకు చేయూత నందించారు. గ్రామానికి చెందిన నిరుపేద దళితులు బలమాల ఉషారాణి, గోరపూడి యశోదలు కూలీ పనులు చేస్తూ కుటుంబ పోషణ చేస్తున్నారు. ఉషారాణికి భర్త లేకపోవడంతో ఆమె కుటుంబానికి రూ.20 వేలు సాయంచేసి ఆమె కూతురు పేరు మీద పోస్టాఫీస్‌లో ఫిక్సిడ్ డిపాజిట్ చేశారు. 25 కేజీల బియ్యంతో పాటు నిత్యావసర వస్తువులు అందించారు. గోరపూడి యశోద కుటుంబానికి రూ.5 వేలు ఆర్థిక సాయంతో పాటు 25 కేజీల బియ్యం, నిత్యావసారలు అందించారు. ఈ కార్యక్రమంలో సూర్యోదయ సామాజిక సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా ఇందిరాగాంధీ జయంతి

కల్లూరురూరల్: మాజీ ప్రధాని స్వర్గీయ ఇందిరాగాంధీ జయంతి వేడుకలను కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆదివారం కల్లూరులో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పసుమర్తి చందర్‌రావు, సత్యంబాబు, దామాలరాజు, కాంతారావు, భరత్, అన్నంరాజు, టీడీపీ నాయకులు రంగారావు, బ్రహ్మారెడ్డి, పుల్లారావు పాల్గొన్నారు.



జయంతి వేడుకలో కాంగ్రెస్, టీడీపీ నాయకులు

కేసీఆర్ సభను జయప్రదం చేయండి

ఎర్రుపాలెం: ఈ నెల 21న మధిర పట్టణంలో నిర్వహించనున్న సీఎం కేసీఆర్ భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్, విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావులు తెలిపారు. ఆదివారం మండలంలోని జమలాపురం గ్రామంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సీఎం బహిరంగ సభకు నియోజకవర్గంలోని అన్ని మండలాల్లోని బీఆర్‌ఎస్ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు తరలివచ్చి జయప్రదం చేయాలన్నారు. ఈ సమావేశంలో మధిర మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ చావా రామకృష్ణ, సొసైటీ చైర్మన్ మూల్పూరి శ్రీనివాసరావు, మాజీ జెడ్పీటీసీ అంకసాల శ్రీనివాసరావు, బీఆర్‌ఎస్ మండల కమిటీ అధ్యక్షులు పంబి సాంబశివరావు, నాయకులు సగ్గుర్తి కిశోర్, శేగిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి, కొండెపాటి సాంబశివరావు, చెన్నంరాజు పురుషోత్తంరాజు పాల్గొన్నారు.